వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 05 అక్టోబర్ 2024

## మహిళా పోలీస్ వైద్య ఖర్చులకు ప్రభుత్వం తరుపున రూ.50వేలు ఆర్థిక సాయం అందజేసిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**రాయచోటి, అక్టోబరు 4, ప్రభాతవార్త:**



రాజంపేట డివిజన్ సుండుపల్లె మండలం పొలిమేరపల్లి గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న వరలక్ష్మి అక్టోబరు 1న పింఛను పంపిణీ నిమిత్తం వెళ్తుండగా అనుకోకుండా ప్రమాదానికి గురి కావడం జరిగింది. విషయాన్ని సుండుపల్లి మండలం ఎంపీడీవో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సదరు మహిళా పోలీసును చికిత్స నిమిత్తం రాయచోటి సాయి ప్రశాంత్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించడం జరుగుతోంది. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేలు ఆర్థిక సాయాన్ని కలెక్టర్ అందజేశారు. మహిళాపోలీసు కుటుంబ సభ్యులు కలెక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు బాలుర పాఠశాల విద్యార్థుల ఎంపిక

**వేంపల్లె, అక్టోబరు 4, ప్రభాతవార్త ః**

ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి అండర్17 హ్యాండ్‌బాల్ పోటీలకు వేంపల్లె బాలుర పాఠశాల క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 7 నుండి 9వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రిలో ఎస్‌జీఎఫ్ఐ అండర్17 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు బాలుర పాఠశ్శాలకు చెందిన ఆదిశేషారెడ్డి, వెంకటశ్రీరామ్, పుణేష్‌కుమార్, సాయి, విష్ణు, ఈశ్వర్‌లు ఎంపికయ్యారు. అండర్14 విభాగంలో గడి ఆనంద్ ఎంపికైనట్లు పీడీ రాజశేఖర్ తెలిపారు. విద్యార్థులను హెడ్‌మాస్టర్ శివమునెమ్మ అభినందించారు. కార్యక్రమంలో పీడీలు జయప్రదం, ఫ్రాన్సిస్, రవికుమార్, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.



# జిల్లా సమగ్ర ఆర్థికాభివృద్ధికి 2వ వందరోజుల ప్రణాళికను రూపొందించండి

**రాయచోటి, అక్టోబరు 4, ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లా ఆర్థికాభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు 2వ వంద రోజుల ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో 2వ వంద రోజుల ప్రణాళిక రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు దూర దృష్టితో విజన్ ఆంధ్ర-2047 తీసుకురావడం జరిగిందన్నారు. జిల్లాలోని కీలక రంగాలు, అంశాలపైన దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. రానున్న 200 రోజులు అనగా డిసెంబరు 31 నాటికి నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలు ఏమిటి, ఏ విధంగా లక్ష్యాలు అధిగమించాలి, అందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే రానున్న 5 సంవత్సరాలలో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ప్రణాళికలు రూపొందించుకొని లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టరు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఓ వెంకట్, పెద్దయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



4 నెలల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి..
నాటి జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి,

## సంక్షేమాన్ని ప్రజలు బేరీజు వేయాలి

- చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి
- ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- మీడియా సమావేశంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



**రాయచోటి, అక్టోబరు 4, ప్రభాతవార్త:**

నాలుగు నెలల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, నాటి జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు బేరీజు వేయాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కోరారు. శుక్రవారం రాయచోటిలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 120 రోజులు అయిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయక, రాబోయే రోజుల్లో అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటుగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిననాలుగు మాసాలలో జగన్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. 1.30 లక్షల రెగ్యులర్ సచివాలయ ఉద్యోగాలు, సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వెయ్యి మంది జనాభాకు ఒకరు చొప్పున సచివాలయ, వార్డు వాలంటీర్ ఏర్పాటుతో 2 లక్షల మంది వాలంటీర్ల నియామకం, ఎన్నో రకాలుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలను ఏ ప్రభుత్వం, ఏ రాష్ట్రం ఈ విధంగా సంక్షేమ, అభివృద్ధి పాలన చేయలేదన్నారు. గాంధీ జయంతి రోజున జగన్ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రారంభించగా కూటమి ప్రభుత్వం ఊరికొక మద్యం షాపును, బెల్టు షాపులను ప్రారంభిస్తున్నారన్నారు. కూటమికి ఫలానా అభివృద్ధి పనులు చేశామని చెప్పుకునే ధైర్యం లేదన్నారు. ఒక వైపు వరదలు, మరో వైపు కరవుతో ప్రజలు అల్లాడుతున్నారని కూటమి ప్రభుత్వం పనితీరుపై మండిపడ్డారు. ఎంఎస్‌ఎంఈ శిక్షణ కేంద్రాన్ని అమరావతికి తరలించడం దుర్మార్గమన్నారు. రాయలసీమ ప్రాంతానికి వచ్చిన వాటిని మరో ప్రాంతానికి తరలించడం ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం దృష్టంతా మద్యంపైనే ఉందని ప్రభుత్వ ఉద్యోగులను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఉచిత ఇసుక దొరక్క పోవడంతో భవన నిర్మాణ కార్మికులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఉచితంగా ఇసుకను అందిస్తామని కూటమి ప్రభుత్వం నేతలు ఆర్భాటంగా చెప్పుచున్నారే కానీ ఎక్కడా ఉచితంగా అందించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో యువతులు, చిన్నారుల అత్యాచారాలకు అంతే లేకుండాపోతోందని శ్రీకాంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితులు చూస్తుంటే భయమేస్తోందని చంద్రబాబు ఎలా చెపుతారని ప్రశ్నించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలకు బడ్జెట్ పెట్టి నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాషా, జడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బేపారి మహ్మద్‌ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొలిమి హరూన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## పెనుగాలులకు పండ్ల తోటలు ధ్వంసం

- కోటి రూపాయల మేర నష్టం



**రాజంపేట, అక్టోబర్ 04,ప్రభాతవవార్త :**

రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లో గత బుధవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి పెనుగాలులు తోడై సుమారు 80 ఎకరాలు అరటి, బొప్పాయి, పండ్లతోటలు నేలమట్టమయ్యాయి. దీంతో పండ్లతోటల రైతులకు సుమారు కోటి రూపాయల మేర నష్టం వాటిల్లింది. రాజంపేట మండలంలో వరదయ్యగారిపల్లెలోని సుమారు 40 ఎకరాలకు పైగా నేల మట్టం కాగా ఆకేపాడు, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లోని పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాల్లో సుమారు 40 ఎకరాలకు పైగా పండ్ల తోటలు నేలమట్టమై నష్టం వాటిల్లింది. రైతులు కంటిమీద కునుకు లేకుండా రాత్రింబవళ్లు కష్టపడి కంటికి రెప్పలా కాపాడుకున్న పండ్లతోటలు దిగుబడినిచ్చి చేతికందే సమయంలో ప్రకృతి గాలుల రూపంలో పగబట్టి పండ్ల తోటలు ధ్వంసం చేసిందన్నారు. ఈ విషయమై రాజంపేట హెచ్ఓ సురేష్ బాబు వివరణ కోరగా రాజంపేట మండలంలో వరదయ్య గారిపల్లెలోనే 40 ఎకరాల మేర నష్టం వాటిల్లిదని ఇంకెక్కడా పెద్ద నష్టం వాటిల్లలేదని తెలిపారు.

## హౌసింగ్ ఏఈ సస్పెండ్, ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్ల తొలగింపు

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 04, ప్రభాతవార్త:**

గృహ నిర్మాణ శాఖ ప్రొద్దుటూరు పట్టణ ఏఈ వెంకటేశ్వర్లుతో పాటు ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లను సస్పెండ్ చేసినట్లు గృహనిర్మాణ శాఖ పిడి రాజారత్నం తెలిపారు. పట్టణ పరిధిలో బొల్లవరం, రామేశ్వరం, మీనాపురం ప్రాంతాల్లో పేదల కోసం 13000 గృహాల నిర్మాణాల కోసం లే అవుట్లను ఏర్పాటు చేశారు. పేదల నిర్మాణాలకై ప్రభుత్వం ఉచితంగా ఇసుకను మంజూరు చేసింది. ఇసుకను అక్రమంగా తరలించారనే ఆరోపణలు రావడంతో కొద్ది రోజుల కిందట విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాధికారులు విచారణ చేపట్టారు. బొల్లవరం కాలనీ లే అవుట్లో సుమారు 4000 మెట్రిక్ టన్నులు, రామేశ్వరం లే అవుట్లో 3000 టన్నులు తక్కువ ఉన్నట్లు గుర్తించారు. వివిధ సచివాలయాల పరిధిలో ఉన్న వెయ్యి కూపన్లను సకాలంలో కంప్యూటీకరణ చేయలేదు. ఈ కూపన్లకు కంప్యూటీకరణ చేయడంలో నిర్లక్ష్యం వహించడం, ఇసుక సరఫరాలో అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అధికారులు కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. గృహ నిర్మాణ శాఖ స్థానిక అధికారి నివేదిక ఆధారంగా చేసుకొని ఏఈ వెంకటేశ్వర్లతో పాటు ఈ లేఅవుట్లలో ఉన్న ఔట్‌సోర్సింగ్ వర్క్ ఇన్స్‌స్పెక్టర్ గుర్రప్ప, ఇందిర, కుమార్‌లను తొలగిస్తూ కలెక్టర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను పీడి రాజారత్నం స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చారు.

## హాకింగ్‌ను తట్టుకుంటేనే డిజిటల్ రంగంలో మనుగడ



**రాజంపేట అర్బన్, అక్టోబర్ 04, ప్రభాతవార్త:**

ప్రస్తుత కాలంలో హాకింగ్‌ను తట్టుకొంటూనే డిజిటల్ రంగంలో మనుగడ సాధ్యమని లైఫాక్స్ టెక్నాలజీ సీఈఓ జి.భరత్ కుమార్ అన్నారు. శుక్రవారం డిజిటల్ డిఫెన్స్ ది ఆర్ట్ అండ్ సైన్స్ ఆఫ్ ఎతికల్ హాకింగ్‌పై అన్నమాచార్య యూనివర్సిటి అవగాహణ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైనా భరత్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక రంగంలో విధ్యార్థులకు ఎతికల్ హ్యాకింగ్‌పై అవగాహణ ఎంతో అవసరం అన్నారు. భవిష్యత్తులో హ్యాకింగ్‌ను తట్టుకుని నిలబడేలా సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కారక్రమంలో డాక్టర్ ఎన్.మల్లికార్జున రావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, వైస్‌చైర్మెన్ చొప్పా ఎల్లారెడ్డి, సిఎస్ఈ హెచ్‌ఓడి డాక్టర్ ఎం.సుబ్బారావు, ఏఐటీఎస్ హెచ్‌ఓడి డాక్టర్ ఫణీంద్ర కుమార్, ఏఐఎంఎల్ హెచ్‌ఓడి డాక్టర్ టి.హరికృష్ణ, కోఆర్డినేటర్ డాక్టర్ మెరిన్, ప్రసన్న, అధ్యాపకులు, విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ

**దువ్వూరు, అక్టోబర్ 04, ప్రభాతవార్త:**

గత రెండు, మూడు రోజులుగా రసాయనిక ఎరువులకు డిమాండ్ పెరగడంతో మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి శుక్రవారం పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ఎరువుల దుకాణాల్లో రసాయనిక ఎరువుల నిల్వాలు ఎంత మేర ఉన్నాయి వాటిని ఏ ధరకు విక్రయిస్తున్నారు, రైతులకు రషీదులు ఇస్తున్నారా లేదా అనే విశయాలను పరిశీలించారు. ఇటివల మండలంలో యూరియా కొరత కూడ ఎక్కువగా ఉందని రెండు, మూడు రోజుల్లో యూరియా వస్తుందని రైతులకు తెలిపారు. రసాయనిక ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతుల వద్ద నుండి ప్రభుత్వం నిర్ణయించిన మేరకు విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రోజు రెండు దుకాణాలు తనిఖీ చేస్తామని పేర్కొన్నారు. ఎరువుల నిల్వాలు సక్రమంగా ఉండాలని ఉన్న నిల్వాలను స్టాక్ బోర్డులో స్పష్టంగా రైతులకు కనపడే విధంగా ఉండాలని ఆదేశించారు.





ముద్దనూరులో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు శరన్నవ రాత్రులలో భాగంగా రెండవ రోజు శ్రీ పార్వతి దేవి అలంకారంలో భక్తులకు ధర్శణం ఇవ్వడం జరిగింది.

## భవాని దేవిగా దర్గా మాతాజీ



**రామాపురం, అక్టోబరు 4, ప్రభాతవార్త:**

మండలంలోని నీలకంఠరావుపేట దర్బార్ సాయి అనంత ఆశ్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 2వ రోజు శుక్రవారం దర్గా మాతాజీ భవానీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం గణపతి పూజ రుద్రాభిషేకం నవగ్రహం అనంతరం మహా మంగళహారతి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని నీలకంఠరావుపేట అమ్మవారి శాలలో 2వ రోజు శుక్రవారం కన్యకా పరమేశ్వరీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు ధర్శనమిచ్చారు. ఆలయంలో పూజలు అభిషేకాలు అలంకారాలు అనంతరం మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయంలో లలిత సహస్త్రనామ కుంకుమార్చన చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వచ్చిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ప్రొద్దుటూరు అమ్మవారి శాలలో శ్రీ భవాణి దేవి అలంకారం



ప్రొద్దుటూరు శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో దాన్య లక్ష్మి దేవి అలంకారం



ప్రొద్దుటూరు శ్రీ రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో భవాణి దేవి అలంకారం

## అనాథ వృద్ధురాలిని అక్కున చేర్చుకున్న అనాధాశ్రమం



**యర్రగుంట్ల, అక్టోబర్ 04, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని తిప్పలూరు ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథ శరణాలయంకు వల్లూరు మండలం దుర్గాయపల్లి లోని లక్ష్మమ్మ అనే 70సంవత్సరాల వృద్ధురాలికి ఎవరూ లేని అనాథ వృద్ధురాలిని శుక్రవారం అనాథ శరణాల నిర్వాహకుడు ఎద్దుల నాగేంద్ర అక్కున చేర్చుకొని ఆశ్రమానికి తీసుకువెళ్లారు. ఆశ్రమ నిర్వాహకులు నాగేంద్ర మాట్లాడుతూ ఎలాంటి అనాథ వృద్ధులు ఎక్కడున్నా సరే మాకు తెలియజేసి అనాథలకు సహాయం అందించవలసిందిగా కోరారు.

## రాజీనామా ఉపసంహరించుకొని పార్టీలో కొనసాగాలి



**యర్రగుంట్ల, అక్టోబర్ 04, ప్రభాతవార్త:**
జమ్మలమడుగు నియోజకవర్గపు మాజీ శాసనసభ్యులు డాక్టర్ సుధీర్ రెడ్డి ఎర్రగుంట్ల టౌన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాయలంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. యర్రగుంట్ల నగర పంచాయతీ మున్సిపల్ చైర్మెన్ మూలే హర్షవర్ధన్ రెడ్డి వైయస్సార్ పార్టీ అధ్యక్షునికి పంపిన రాజీనామ లేఖను ఉపసంహరించుకొని, మళ్లీ పార్టీలో కొనసాగాలని యర్రగుంట్ల నగర పంచాయతీ కౌన్సిలర్లు మరియు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండడం వల్ల యర్రగుంట్లలో 20 వార్డులు గెలుపొందామని ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం మంచిది కాదని ఆయన వివరించారు. నీకు ఏదైనా సమస్య ఉంటే కౌన్సిలర్లతో అందరితో సమిష్టిగా కూర్చొని చర్చించుకోవాలని ఇలాగా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. హర్షవర్ధన్ రెడ్డిని చూసి పదవి ఇవ్వలేదని మాజీ మంత్రి డాక్టర్ ఎంవీ మైసూరా రెడ్డి తనయుడు కావడం వల్లనే సభ్యులందరూ ఏకగ్రీవంగా నీకు పదవి ఇచ్చారని వివరించారు. శాసనసభ ఎన్నికల్లో సుధీర్ రెడ్డి ఓటమి చెందిన తర్వాత మొట్ట మొదటి సారిగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.

## మండల, శాఖ మహాసభలను జయప్రదం చేయండి

**బ్రహ్మంగారిమఠం, అక్టోబర్ 4 ( ప్రభాతవార్త):**



ఈ నెలలో మరియు రేపు నెలలో జరిగే మండల, శాఖ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల6వ తేది నుండి శాఖ మహాసభలు కొనసాగి ఈ నెలాఖరు పూర్తవుతాయని నవంబర్ 3వ వారంలో మండల మహాసభలు రెండు,మూడు రోజుల పాటు నిర్వహిస్తామని ఈ సభలలో ఉద్యమ అనుభవాల నిర్మాణాన్ని సమీక్షించి రాబోయే మూడు సంవత్సరాల కాలానికి భవిష్యత్తు ఉద్యమ కర్తవ్యాలను నిర్దేశించుకోనున్న ఆమని అలాగే దేశవ్యాప్తంగా హెచ్చుమీరుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను సమీక్షించి రాబోయే కాలంలో వాటిని ప్రజా ఉద్యమాలుగా నిర్మించుకునేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. కావున ఈ మహాసలబను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటి సభ్యులు హరి, గండి సునీల్‌కుమార్, కార్యకర్తలు ఎద్దు రాహుల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాం



**బద్వేలు అర్బన్, అక్టోబర్ 4 ప్రభాతవార్త :**
దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పట్టణ పరిధిలో పలుచోట్ల పర్యటించారు. ఇందులో భాగంగా అన్నాక్యాంటిన్, హెచ్‌పీ. పెట్రోల్‌బంక్‌ల సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అలాగే రామాంజనేయనగర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి పరిశుభ్రంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అంతేగాక దోమల నివారణకై సీమాంక్ హాస్పిటల్ పక్కనగల నీటి కుంటలో, పెట్రోలు బంక్ పక్కన నీటిలో, మిద్దెలవారిపాళెం వాటర్ ట్యాంక్‌లతో పాటు పలుచోట్ల లక్ష గంబూసియా చేపలను వదిలి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

**మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశం:**
మెప్మాసిబ్బందితో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘంలో విలీనమైన గ్రామాలలో ఆసక్తి గలవారికి పాడిపశువు బ్యాంక్ రుణాల మంజూరుకై ప్రత్యేక చర్యతు తీసుకోవాలన్నారు. ఇల్లు నిర్మించుకోవాలని లబ్దిదారులకు ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఇల్లు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు.

## ముగిసిన క్యాంపస్ ఇంటర్వ్యూలు



**కాశినాయన, అక్టోబర్ 4(ప్రభాతవార్త):**
పోరుమామిళ్లలోని శ్రీ వేంకటేశ్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలలో 20 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు కంపెనీ హెచ్‌ఆర్‌లు బాబా ఫక్రుద్దీన్, శివ, కోడ్ వర్క్స్ సిఈవో రవిలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను బి. ఓబుళరెడ్డి, కె.రామిరెడ్డి, జి. పోలిరెడ్డి మరియు వెంకటరామిరెడ్డిలు అభినందించారు. వారు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆకాంక్షించారు.

## పట్టణంలో విస్తృతంగా వాహనాల తనిఖీ

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 4(ప్రభాతవార్త):**



పట్టణంలో శుక్రవారం సాయంత్రం అర్బన్ ఎస్ఐ రవికుమార్ ప్రదాన రహదారులలో సిబ్బందితో కలిసి తిరుగుతూ వాహనాల తనిఖీ చేపట్టారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్‌లేని వాహనదారులకు మరియు త్రిబుల్ రైడింగ్ వస్తున్న వారికి జరిమానా విధించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, పెరుగుతున్నజనాభాకు అనుగుణంగా వాహనాల రద్దీ ఎక్కువగా ఉందని కావున వాహనదారులు ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపరాదని సూచించారు.

## ఎద్దులవారిపల్లెలో వానరానికి అంత్యక్రియలు

**తంబళ్లపల్లె, అక్టోబరు 4, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండలం ఎద్దులవారిపల్లెలో శుక్రవారం ఓ వానరం గ్రామం లోని చింతచెట్టు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడి అక్కడి కక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు వానరానికి పూల మాలలు అలంకరించి వానరానికి పూజలు చేసి మేళ తాళాలతో అలంకరించి గ్రామం బయట అంత్యక్రియలు నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా ముస్లిం సోదరులు అంత్యక్రియల్లో పాల్గొనడం విశేషం.

## ఎంపీడీఓ, ఈఓపిఆర్డి నియామకం

**దువ్వూరు, అక్టోబర్ 04, ప్రభాతవార్త:**
దువ్వూరు మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీఓగా రామకృష్ణయ్య, ఈఓపిఆర్డిగా హరికృష్ణ యాదవ్ ను నియమించారు. దువ్వూరు ఎంపీడీఓగా దువ్వూరు ఇంచార్జ్ ఎంపీడీఓగా ఉన్న ఈఓపిఆర్డి శివప్రసాద్‌ను నంద్యాలకు బదిలీ చేయగా ఆయన స్థానంలో గోపవరంలో ఎంపీడీఓగా పనిచేస్తున్న రామకృష్ణయ్యను నియమించారు. అలాగే ఈఓపిఆర్డిగా బి.కోడూరులో పని చేస్తున్న హరి కృష్ణయాదవ్‌ను నియమించారు. వీరిరువురు బాధ్యతలు చేపట్ట వలసి ఉంది.

## బాలుడు అదృశ్యం కేసు నమోదు

**దువ్వూరు, అక్టోబర్ 04, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరు హరిజనవాడకు చెందిన అమర్ అనే రెండు సంవత్సరాల బాలుడు అదృశ్యం కావడంతో కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అమర్ అనే బాలుడు గురువారం సాయంత్రం తన ఇంటి వద్ద ఆడుకొనుచుండగా తల్లిదండ్రులు తమ పని చేసుకుంటూ ఉన్నారు. తిరిగి వచ్చి చూడగా బాలుడు కనిపించకపోవడంతో అక్కడ సమీపంలో ఉన్న ఇళ్ల వద్ద వెతికారు. అక్కడ లేకపోవడంతో దువ్వూరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకి కోసం దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ రహదారిలలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. అలాగే ఇంటికి సమీపంలో కేసీ కాలువ ఉన్నందున అగ్ని మాపక శాఖకు చెందిన సిబ్బంది కేసీ కాలువలో వెతికారు. ప్రస్తుతానికి కాలువలో ఎక్కువగా నీరు ఉన్నందున నీరు తగ్గిన తర్వాత వెతకాలని పేర్కొన్నారు. బాలుడిని ఎవరైనా కిడ్నాప్ చేశారా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఎప్పటి నుండి అమలు చేస్తుందో?



**పులివెందుల, అక్టోబరు 4, ప్రభాతవార్త :**
ఏపీలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను ఎప్పటి నుండి అమలు చేస్తుందోనని వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, జిల్లా కోశాధికారి రాఘవేంద్రారెడ్డిలు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పులివెందులలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100రోజులు పూర్తయిందని, ఇది మంచి ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటున్నా కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమలు గురించి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అన్నీ అమలు చేసిన తరువాతే ఇది మంచి ప్రభుత్వం అనిపించుకోవాలన్నారు. స్వాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలంటే భయమేస్తోందని, ఖజానా ఖాళీగా ఉందని చెబుతుండడంతో అసలు సూపర్‌సిక్స్ పథకాలు అమలవుతాయా? అని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి మున్ముందు ముసళ్ల పండుగే అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు భాగ్యరాజ్, షేక్ హర్షద్, ఆర్.సాయి, శివ, తదితరులు పాల్గొన్నారు.

## పన్నులు చెల్లించి పురపాలిక అభివృద్ధికి సహకరించండి




**పులివెందుల రూరల్, అక్టోబరు 4, ప్రభాతవార్త :**
పులివెందుల పురపాలికలోని ప్రజలు పన్నులు చెల్లించి పురపాలిక అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమీషనరు రాముడు కోరారు. ఆస్తిపన్ను, నీటిపన్ను, ట్రేడ్ లైసెన్సు, ఖాళీ స్థలాల పన్ను మొదలగు వాటి వసూళ్లను మెరుగు పరిచేందుకు సంచార పన్ను వసూలు వాహనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వాహనం వద్ద ఉన్న సిబ్బందికి పన్నులు చెల్లించి ఆన్‌లైన్ రశీదులు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి మునికుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు మధుసూధన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్ పరిపాలన మీద దృష్టి పెట్టాలి

**వేంపల్లె, అక్టోబరు 4, ప్రభాతవార్త :**



డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్ పరిపాలన మీద దృష్టి పెట్టాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి సూచించారు. వేంపల్లెలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సనాతనధర్మం, హిందూ ధర్మం గురించి డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నేను హిందువునని, నా ప్రాణం పోయే వరకు సనాతన ధర్మంకోసం పోరాడుతానని పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించడం ఆత్మవంచన అన్నారు. భార్య హిందువు కాదు.. క్రిష్టియన్ అని, చిన్న కూతురు హిందువు కాదు.. క్రిష్టియన్ అని, అందుకే తిరుపతి ఆలయంలో డిక్లరేషన్‌పై సంతకం పెట్టారన్నారు. పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్తదీక్ష ఒక డ్రామా అన్నారు. గ్రామాలలో సంపదసృష్టి కేంద్రాలు నిరుపయోగంగా మారి దరిద్ర కేంద్రాలుగా ఉన్నాయన్నారు. గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. నిధులు, విధులు, అధికారాలు లేక స్థానిక ప్రభుత్వాలు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నాయని తులసిరెడ్డి అన్నారు. ఇప్పటికైనా పాలనపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు.

## బ్రాహ్మణుల అభివృద్ధికి చంద్రబాబు కృషి

**వేంపల్లె, అక్టోబరు 4, ప్రభాతవార్త :**
రాష్ట్రంలో బ్రాహ్మణుల అభివృద్ధికి సిఎం కృషి చేయడం సంతోషకరమని జిల్లా బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు ప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. వేంపల్లెలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేవదాయశాఖ ఆధీనంలోని లేని చిన్న దేవాలయాలలో అర్చక, పురోహితులకు ధూప, దీప నైవేద్యాల కింద రూ.10వేలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం హర్షనీయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల నుండి సమగ్ర విచారణ చేసి దేవదాయశాఖ పరిధిలో లేని ఆలయాలకు ధూప, దీప నైవేద్యాలకు డబ్బులు పెంచారన్నారు. తెదేపా ప్రభుత్వం బ్రాహ్మణులకు న్యాయం జరుగుతుందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్, క్రెడిట్ సొసైటిలకు పునర్‌వైభవం తీసుకువచ్చి అనేక మంది బ్రాహ్మణ కుటుంబాలకు చేయూతగా నిలవాలని ఆయన కోరారు.

# బిల్వ వృక్ష నివాసిని దేవి అలంకారంలో వాసవి మాత





**రాజంపేట అర్బన్, అక్టోబర్ 04, ప్రభాతవార్త:**
శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అమ్మవారి శాలలో వాసవీ మాత బిల్వ వృక్ష నివాసిని దేవి అలంకారంలో భక్తులకు దర్శణం ఇచ్చారు. రెండవ రోజు తెల్లవారు జామున 3గంటల నుంచే స్థానిక అమ్మవారిశాలలో 108 ప్రదక్షిణల కోసం భక్తులు పోటెత్తారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం బిల్వ వృక్ష నివాసిని దేవి అలంకారం భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది. ఉదయగిరి ఎల్లమ్మ దేవి ఆలయంలో బ్రహ్మచారిణి అలంకారంలో అమ్మవారు దర్శణం ఇచ్చారు. అదేవిధంగా చౌడేశ్వరి దేవి ఆలయంలో సాధు కామాక్షమ్మ ఆలయంలోనూ ప్రత్యేక అలంకారాలతో జగజ్జనని అలంకరించారు. భక్తుల రాకతో ఆలయాలకు కొత్త శోభ కన్పించింది.

## రామగోపాల్‌రెడ్డి, బీటెక్ రవి మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది

**పులివెందుల, అక్టోబరు 4, ప్రభాతవార్త :**



ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవిలు మట్కా, జూదం, అక్రమ మైనింగ్ గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని వైకాపా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందులలో శుక్రవారం వైఎస్ఆర్‌సీపీ నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 100రోజుల పాలనలో కూటమి నాయకులు శాండ్ రీచుల్లో, హౌసింగ్ సైటులలో ఉన్న వేల టన్నుల ఇసుక దౌర్జన్యం, అక్రమంగా రవాణా చేయలేదని చెప్పగలరా అని వారు టీడీపీ నాయకులను ప్రశ్నించారు. ఉచిత ఇసుక అనేది కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమైందన్నారు. ప్రజలకు ఎవ్వరికీ ఇసుక అందుబాటులోకి రాలేదన్నది వాస్తవం కాదా అని వారు ప్రశ్నించారు. టీడీపీ నాయకులు ప్రజలకు అధిక ధరలకు ఇసుకను అమ్మిన మాట వాస్తవం కాదా, మీకు చిత్తశుద్ధి ఉంటే వీటన్నింటిపై ప్రమాణం చేయడానికి మీరు సిద్ధమేనా అని వారు సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సజావుగా సాగుతున్న మైనింగ్ వ్యవస్థను, మైనింగ్ లీజుదారులను భయపెట్టి మీ వద్దకు రప్పించుకుని వారి నుండి మీ నాయకులకు అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలను కట్టబెట్టింది వాస్తవం కాదా అని అన్నారు. కమీషన్ మాకు ఇచ్చి మైనింగ్ యథేచ్ఛగా జరుపుకోవచ్చని, మీరు, మీ నాయకులు మాట్లాడడం మీకు గుర్తు లేదా? స్వాక్షాత్తు జిల్లా ఎస్పీనే అక్రమ మైనింగ్ ఉంది అంటే మీరు బుకాయించడం ఎంతవరకు సమంజసం, మీరు ఈ విషయమై ఎక్కడ ప్రమాణం చేయగలరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి, బండి రామమునిరెడ్డి, భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, హాఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

# విహారయాత్రలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి

### ఏపి దర్శన్ విజ్ఞాన విహారయాత్ర బస్సులకు జెండా ఊపి ప్రారంభం

### క్షేమంగా వెళ్లి.. విజ్ఞానంతో తిరిగి రండని... విద్యార్థులకు సూచన




**కడప, అక్టోబరు 4, ప్రభాతవార్త**
విహారయాత్రలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని పెంపొందింపచేస్తాయని జిల్లా కలెక్టర్ శివశంకర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుండి ఏపి దర్శన్ పేరుతో జిల్లా నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 500 మంది విద్యార్థులతో విజ్ఞాన విహార యాత్రకు బయలుదేరిన బస్సులను, కడప ఎమ్మెల్యే ఆర్ మాధవిరెడ్డి, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజులతో కలిసి జిల్లా కలెక్టర్ శివశంకర్ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో ఏపి దర్శన్ పేరుతో జిల్లా నుండి విజ్ఞాన విహారయాత్రకు బయలుదేరిన 10వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గైడ్స్‌తో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రేరణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్‌తోపాటు, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డిఎఫ్ఓ సందీప్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ముఖ్య అతిధులుగా హాజయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో వైఎస్ఆర్ జిల్లా నుండి ఏపి దర్శన్ విజ్ఞాన విహారయాత్రను 10వ తరగతి విద్యార్థుల కోసం వినూత్నంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ దసరా సెలవుల్లో కడప నుండి అరకు వరకు ఏపి దర్శన్ పేరుతో విజ్ఞాన విహారయాత్రను రూపొందించడం జరిగిందన్నారు. జిల్లాలోని 370 పైగా ప్రభుత్వ పాఠశాలలు, జడ్పీ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించి ఈ విజ్ఞాన యాత్ర కోసం ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో టాపర్‌లుగా నిలిచిన 500 మందిని ఎంపిక చేసి కడప నుండి అరకు వరకు పంపించడం జరిగిందన్నారు. ఈ యాత్ర శ్రీకాళహస్తి, శ్రీహరికోట, అక్కడి నుండి పులికాట్ లేక్, అక్కడి నుండి చిలకలూరిపేట మీదుగా అమరావతి, కొండవీడు, విజయవాడలో అంబేద్కర్ స్టాచ్యూ, మ్యూజియం, అక్కడి నుండి పోలవరం, కాకినాడ, యానం, ద్వారక తిరుమల అలాగే విశాఖపట్టణం ఎస్ప్విజడ్, విశాఖపట్టణంలోని ఇతర పర్యాటక ప్రదేశాలను సందర్శించి చివరగా అరకును తిలకించడం జరుగుతుందన్నారు. ఈ టూర్ ప్రోగ్రాంకు 11 లగ్జరీ బస్సులను కేటాయించడం జరిగిందని, విహారయాత్రకు వెళ్లేవారికి ప్రతి ప్రదేశంలో కూడా అక్కడి సంబంధిత కలెక్టర్లతో మాట్లాడి అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ విజ్ఞానయాత్ర వల్ల పిల్లల్లో చురుకుదనం పెంచడంతోపాటు రాష్ట్రంలోని ప్రాముఖ్యత ఉన్న దర్శనీయ ప్రాంతాల పట్ల అవగాహన, అక్కడి చరిత్ర, భౌగోళిక స్థితి, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందన్నారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం అక్కడి కొత్త అంశాలను చూసి తెలుసుకోవాలన్న ఆశ ప్రతి ఒక్క విద్యార్థి అలవర్చుకోవాలన్నారు. విద్యార్థుల మానసిక వికాసానికి దోహదపడుతుందన్నా ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. అనంతరం పలువురు ప్రసంగించారు.










## పిడుగుపాటుతో ఆవు మృతి

గాలివీడు, అక్టోబర్ 4(ప్రభాతవార్త):



మండలంలోని అరవీడు గ్రామ పంచాయతీ శ్రీనగర్‌కాలనీకి చెంద లక్ష్మీదేవి పాడి ఆవు గురువారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడటంతో మృతిచెందినట్లు రైతు తెలిపారు. విషయం తెలుసుకొన్న మండల పశువైద్యాధికారి టి.భాస్కర ఆవుకు పంచనామా చేసి శవపరీక్ష చేయడం జరిగిందన్నారు ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ పాలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నామని పాడి ఆవు చనిపోవడంతో మాకు జీవనోపాధి ఇబ్బందికరంగా మారిందని ప్రభుత్వం మాకు తగిన సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.

## బాలత్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు

గాలివీడు, అక్టోబర్ 4(ప్రభాతవార్త):



రెండవ రోజు బాలత్రిపుర సుందరీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని గోపనపల్లె గ్రామం పూజారివారిపల్లెలోని ఇరుగులమ్మ ఆలయంలో శుక్రవారం రెండవ రోజు అర్చకులు నాగఫణికిశోర్‌శర్మ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు అమ్మవారిని పూజిస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అమ్మను భక్తిశ్రద్ధలతో పూజించిన వారికి శత్రువులను లేకుండా చేస్తుందని, ధనాదాయాన్ని పెంచుతుందని వ్యాఖ్యానించారు. అంతేగాక ఆయుష్షును వృద్ధి చేసి, ఆరోగ్య బలాన్ని ఇస్తుందన్నారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

## ఎంపీడీవో ఉపేంద్రరెడ్డికి ఘన సన్మానం

తంబళ్లపల్లె, అక్టోబరు 4, ప్రభాతవార్త:



మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్రరెడ్డికి స్థానిక నాయకులు, అధికారులు ఘనంగా సన్మానించి సాదర స్వాగతం పలికారు. ఉదయం పీలేరు నుంచి బదిలీపై వచ్చిన ఆయనను కూటమి మండల నాయకుడు ముద్దలదొడ్డి శంకర్‌రెడ్డి దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఇందుకు మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, కార్యాలయ సిబ్బంది సహకారం అందించాలని కోరారు.

## 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



సిద్దవటం, అక్టోబరు 4, ప్రభాతవార్త:

లంకమల్ల అటవీ ప్రాంతం సిద్దవటం ఫారెస్ట్ రేంజ్‌లో శుక్రవారం ఫారెస్టు రేంజ్ అధికారి కళావతి ఆధ్వర్యంలో రోజు వారి తనిఖీల్లో భాగంగా ఎద్దుల గుండాలు ప్రదేశానికి వెళ్లగా ఆ ప్రాంతంలో కొంత మంది అటవీ సంపద కొల్లగొట్టే స్మగ్లర్లు కనపడగా వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా పారిపోయారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తమ కార్యాలయంలో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో తనిఖీల్లో భాగంగా మా సిబ్బందితో పాటు వెళ్లగా కొంత మంది స్మగ్లర్లు అటవీ సంపద కొల్లగొడుతు కనబడ్డారని వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా అటవీ ప్రాంతం నుంచి పారిపోయారని ఆ ప్రాంతంలో 13 దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా వేగవంతం చేశామని కొత్త వ్యక్తులు ఎవరైనా మీ గ్రామాల్లో సంచరిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఎఫ్‌బీవో పెంచలరెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు ఘన సత్కారం

సిద్దవటం, అక్టోబరు 4, ప్రభాతవార్త:



సిద్దవటం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జవహర్ బాబు గాలివీడు ఎంపీడీవోగా బదిలీ కావడంతో శుక్రవారం ఆయనను ఉపాధి హామీ ఏపీవో నరసింహులు మరియు ఉపాధి హామీ సిబ్బంది ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జవహర్ బాబు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీలు తప్పవని మండలంలో ఉన్న ప్రజా ప్రతినిధులు, సర్పంచులు ప్రతి ఒక్కరూ సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. ఏపీవో నరసింహులు మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో జవహర్‌బాబు విధి నిర్వహణలో భాగంగా అంకిత భావంతో పని చేశారని ఆయన సేవలను కొనియాడారు.

## ఆదర్శనీయం మీ సేవలు



వైవీయూ, అక్టోబర్ 04,ప్రభాతవార్త:

సమాజ సేవ చైతన్యంలో మీ మార్గం అనుసరణీయం, ఆదర్శనీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. జాతీయ సేవా పథకం వైవీయూ 2023-24 విద్యా సంవత్సరానికి విశ్వవిద్యాలయ స్థాయి జాతీయ సేవా పథకం పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశం అంటే మట్టి కాదోయ్ దేశం అంటే మనుషులోయ్ అన్న మహాకవి గురుజాడ మాటలను అందిపుచ్చుకొని దేశ సౌభాగ్యం కోసం పాటు పడాలని సూచించారు. విశ్వవిద్యాలయం లోను అన్ని కళాశాలల సమాజంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేసిన కళాశాలల ప్రిన్సిపల్‌లు, పిఓలు, వాలంటీర్లు అభినందనీయులన్నారు. పురస్కార గ్రహితలను అభినంధించారు. రిజిస్ట్రార్ ఆచార్య తప్పెట రామ్‌ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్ధ సేవలో అందిస్తున్న సేవలు నిరుపమానమన్నారు. ప్రధానాచార్యులు ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో వెలుపల ఎన్ఎస్ఎస్ అందించిన సేవలు గుర్తుంచు కోదగినవన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎన్. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని, ఈ సందర్భంగా ఉత్తమ కళాశాలల తరుపున సి. యోగాంజనేయులు (జూనియర్ కాలేజ్ వేంపల్లి), కె. వెంకట సుబ్బారెడ్డి, ఎస్‌బివిఆర్ డిగ్రీ కళాశాల బద్వేల్) షేక్‌నూర్జహాన్ (ప్రిన్సిపల్, ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజి)లకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేశారు. డి.మానస, (యూనిట్ 9 వైవీయూ), ఐ.మహబూబ్ బాషా (ఎస్బిఎస్వైఎం డిగ్రీ కళాశాల మైదుకూరు) మీనాక్షి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కడప)లకు ఉత్తమ వాలంటీర్ పురస్కారం అందజేశారు. ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కను సు శ్రీనివాసరావు (వైవీయూ) డాక్టర్ ఎం. దొరస్వామి నాయక్, (ఎస్‌బివిఆర్ డిగ్రీ కళాశాల బద్వేల్) బి.రవి కుమార్ (ఎస్‌బిఎస్‌వైఎం డిగ్రీ కళాశాల మైదుకూరు),జి. రఘురామయ్య (ప్రభుత్వ జూనియర్ కళాశాల, వీరబల్లి), డాక్టర్ ఎల్. హేమలత కృష్ణవేణి (ఎపి మోడల్ జూనియర్ కాలేజి పెనమలూరు)లకు పురస్కారము అందజేసి సత్కరించారు.

## మర్యాదపూర్వక కలయిక



సమస్యలను వివరిస్తున్న తెలుగు యువత నాయకులు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబర్ 04, ప్రభాతవార్త :

విజయవాడలో జరిగిన శాప్ చైర్మన్ రవినాయుడు ప్రమాణ స్వీకారానికి మండల తెలుగు యువత అధ్యక్షుడు పక్కీరయ్య హాజరైయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం రాజంపేట పార్లమెంట్ యువత అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రవాణా, క్రీడా యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలను కలిసి లక్కిరెడ్డిపల్లె మండల ప్రధాన సమస్యలైన తాగునీటి సమస్య, నిరుద్యోగ యువత, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను వివరించామన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖా మంత్రులు సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

## శ్రీగాయత్రి దేవి అలంకారంలో...

లక్కిరెడ్డిపల్లె, అక్టోబర్ 04, ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని విశ్వభారతి స్కూల్ సమీపంలో వెలసిన సర్వమంగళదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శ్రీ గాయత్రీదేవిగా అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరిస్వామి అలంకరించారు. నైవేద్యంగా కొబ్బరి పాయసంను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా కుంకుమార్చనలు మంగళ హారతుల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఓబులేశ్వరమ్మ, ఆలయ ధర్మకర్తలు, గొర్ల మోహన్‌రెడ్డి, భూదేవమ్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కలికిరి ఎంపీడీవోగా భానుమతిరావు

కలికిరి, అక్టోబరు 4, ప్రభాతవార్త:



కలికిరి ఎంపీడీవోగా భానుమతిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలికిరి ఎంపీడీవోగా పనిచేస్తున్న గంగయ్యను కురబలకోట ఎంపీడీవోగా ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో వడమాలపేట ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న భానుమతిరావును కలికిరి ఎంపీడీవోగా నియమించింది. దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వాసనూరి చంద్రశేఖర్, కలికిరి మండలం టీడీపీ మైనార్టీ అధ్యక్షులు మున్వర్ అలీ, తెదేపా నాయకులు కొటాల చల్లయ్య, మర్రికుంటపల్లె సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, గుండ్లూరు పంచాయతీ టీడీపీ నాయకులు సురేంద్ర, మేడికుర్తి మాజీ ఎంపీటీసీ జనార్ధన్‌గౌడ్, టీడీపీ నాయకులు రాఘవేంద్ర, మర్రికుంటపల్లె పంచాయతీ టీడీపీ నాయకులు ఒంబాల రెడ్డయ్య, చీకటిపల్లె పంచాయతీ టీడీపీ నాయకులు మదన మోహన్‌రెడ్డి ఎంపీడీవోను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కలికిరి, అక్టోబరు 4, ప్రభాతవార్త:

కలకడ మండలం కదిరాయచెరువు పంచాయతీలో స్థానిక సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి అధిక సంఖ్యలో రోగులు హాజరుకావడం జరిగింది. వారందరికి వైద్యులు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో డా.వెంకటరమణ, డా.అను, పీఆర్వో భార్గవచంద్ర, భజనగురువు రామయ్య, సిబ్బంది భువనేశ్వరి, యమున, సుమలత, ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న 2 ట్రాక్టర్లు సీజ్

కలికిరి, అక్టోబరు 4, ప్రభాతవార్త:

మండలంలోని మేడికుర్తి బాహుదా నది నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 2 ట్రాక్టర్లను సీజ్ చేసి తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు కలికిరి సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న 2 ట్రాక్టర్లను పోలీసులు తనిఖీ చేయగా అనుమతి లేదని బయట పడింది. దీంతో ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేశారు.

## మదనపల్లె ఎంపిడిఓగా మస్తాన్‌వలి

మదనపల్లె, అక్టోబర్ 4 ప్రభాతవార్త :



మదనపల్లె ఎంపిడిఓగా మస్తాన్‌వలి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎఓగా పనిచేస్తున్న ఇతన్ని ఎంపిడిఓగా బదిలీ చేస్తే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకరంతో మదనపల్లె మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తాననన్నారు.

## గాయత్రీదేవి అలంకరణలో...

మదనపల్లె, అక్టోబర్ 4 ప్రభాతవార్త :



మదనపల్లె పట్టణ ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు శుక్రవారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమించారు. దేవి నవరాత్రుల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారిని గాయత్రీదేవి అలంకరణ చేశారు. భక్తులు పెద్దఎత్తున్న అమ్మవారిని దర్శించుకున్నారు. అర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్ అధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

## మర్యాదపూర్వక కలయిక

కడప వైద్యవిభాగం, అక్టోబరు 4, ప్రభాతవార్త:



తెదేపా రాష్ట్ర కార్యాలయం విజయవాడలో శుక్రవారం తెదేపా రాష్ట్ర అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఏపీఎస్ ఆర్టీసీ కార్మిక పరిషత్ రాష్ట్ర కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి ఆర్టీసీ ఉద్యోగుల విలీన సమస్యలను వారికి వివరించి సత్వర పరిష్కారం కొరకు సదరు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సిందిగా కోరారు. సంబంధిత మెమోరాండంను వారికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శేషగిరిరావు, శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి కోసూరి సురేంద్ర, ప్రచార కార్యదర్శి యార్లగడ్డ రమేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పురుషోత్తం పాల్గొన్నారు.

## అంజుమ్ మృతికి కారణమైన వారి

# కఠినంగా శిక్షించాలి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



శాంతిర్యాలీ నిర్వహిస్తున్న మతపెద్దలు

మదనపల్లె, అక్టోబర్ 4 ప్రభాతవార్త :

పుంగనూరుకు చెందిన ఆరేళ్లచిన్నారి అస్పియా అంజుమ్ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం అస్పియా అంజుమ్ ఆత్మశాంతికోసం శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరేళ్లచిన్నారిని అతికిరాతకంగా హత్యచతేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలన్నారు. హత్యకు సంబంధించి సమగ్ర దర్యాప్తును చేపట్టాలని ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పోలీసులను ఆదేశించటం జరిగిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఇటువంటి హత్యలకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమన్నారు. అనంతరం మత పెద్దలతో కలిసి శాంతిర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, మతపెద్దలు పాల్గొన్నారు.

## యూటీఎఫ్‌లో చేరికలు



కడప వైద్యవిభాగం, అక్టోబరు 4, ప్రభాతవార్త:

కడపలోని యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు ఆధ్వర్యంలో ఇతర సంఘాలకు చెందిన నేతలు తమ పదవులకు రాజీనామా చేసి యూటీఎఫ్‌లో చేరారు. యూటీఎఫ్‌లో చేరిన నాయకులకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. విద్యా రంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం యూటీఎఫ్ పోరాడుతూనే ఉందన్నారు. ఉపాధ్యాయుల పక్షాన పోరాడే ఉపాధ్యాయ సంఘంలో కొనసాగడం ద్వారా మాత్రమే ఉపాధ్యాయ లోకానికి మేలు జరుగుతుందని భావించి యూటీఎఫ్‌లో చేరుతున్నామన్నారు. జిల్లాలో యూటీఎఫ్ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, సహాధ్యక్షురాలు సుజాత రాణి, జిల్లా కార్యదర్శులు చెన్నయ్య, ఎజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, జిల్లా మాజీ కార్యదర్శి జోజయ్య, నాయకులు ఈశ్వరరావు పాల్గొన్నారు.

## సీనియర్ అసిస్టెంటుగా వెంకటేశ్వరయ్య

పీలేరు, అక్టోబరు 04 ప్రభాతవార్తః



మదనపల్లె హెచ్ఎన్ఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న వెంకటేశ్వరయ్య పీలేరు తహశీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న రెడ్డెప్పను మ్యూచివల్‌గ్రాంట్సు కింద బదిలీపై వెళ్లారు,.శుక్రవారం పీలేరు రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా రెడ్డెప్ప నుంచి నంద్యాల వెంకటేశ్వరయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా తమశీల్దారు భీమేశ్వరరావు మాట్లాడుతూ కార్యాలయంలో ఉన్న అన్ని రికార్డులను సకాలంలో పూర్తిచేసి బాధ్యతాయుతంగా పనిచేయాలని వెంకటేశ్వరయ్యకు సూచించినట్లు ఆయన తెలిపారు.

## నేరాల నియంత్రణకు కషిచేయాలి

పీలేరు, అక్టోబరు 04 ప్రభాతవార్తః



పట్టణంలో అనునిత్యం రద్దీగా అనేక రకాలపనులపై అత్యధిక జనాభా కలిగి ఉన్న పీలేరు పట్టణంలో ఎటువంటి నేరాలు జరగకుండా నేరాలపై నిఘా ఉంచాలని రాయచోటి డీఎస్పీ కష్ణమోహన్ తెలిపారు. పట్టణంలోని బండ్లవంకలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పరిశీలన నిమిత్తం శుక్రవారం పీలేరుకు వచ్చిన డీఎస్పీని విలేకరులు కలవడంతో పట్టణంలో అనునిత్యం పోలీసు గస్తీ నిర్వహించాలని, అదేవిధంగా నేరాలకు తావులేకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యుగంధర్, సబ్ ఇన్స్‌పెక్టర్ బాలకష్ణలు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీ గురించి మాట్లాడే నైతిక అర్హత పవన్ కళ్యాణ్‌కు లేదు

ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమతతేజ

పీలేరు, అక్టోబరు 04 ప్రభాతవార్తః



అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన కళ్యాణ్ గారి వేషం, బాష రెండు మారాయని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమతతేజ అన్నారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ సెక్యూలర్ పార్టీగా ఉన్న జనసేన కాస్త రైటిస్ట్ పార్టీగా మారిందా అనే సందేహం రాష్ట్ర ప్రజలకు కలుగుతోందన్నారు. బాధ్యత కలిగిన పదవిలో ఉండి ఒక మతానికి చెందిన వేషాన్ని వేసుకుని ఆమతమే ముఖ్యమని మాట్లాడుతుంటే ఇతర మతాలకు అభద్రతాభావం ఉండదా అని ప్రశ్నించారు. మతం అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమైతే అదే సిద్ధాంతానికి పవన్‌కళ్యాన్ డబుల్ ఏజెంటు అయ్యారన్నారు. ప్రధాని నరేంద్రమోడీ దర్శకత్వంలో యాక్టింగ్ చేసే మీకు రాహుల్‌గాంధీ గురించి మాట్లాడే నైతికత లేదని మండిపడ్డారు. ఈ దేశంలో ప్రేమ, సమానత్వం సోదరభావం పెంపొందించేందుకు రాహుల్‌గాంధీ వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అటువంటి వ్యక్తి గురించి మాట్లాడి పవన్ కళ్యాణ్ స్థాయిని దిగజార్చుకోవద్దు అని తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

పీలేరు, అక్టోబరు 04 ప్రభాతవార్తః

పట్టణంలోని బండ్లవంక ప్రాంతంలో గత నెల 18న నమోదైన ఎస్సీ,ఎస్టీ వేధింపుల కేసుపై శుక్రవారం రాయచోటి డీఎస్పీ కష్ణమోహన్ విచారణ చేపట్టారు. ఇదే ప్రాంతంలో లీలావతం అనే మహిళ తన ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటుండగా పక్కనే నివాసముంటున్న రవి, నాగరత్నలు కులం పేరుతో దూషించారని పీలేరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని డీఎస్పీ తెలిపారు. ఈమేరకు విచారించి నివేదికను జిల్లా ఎస్పీగారికి అందజేస్తామన్నారు. డీఎస్పీ వెంట సీఐ, ఎస్సైలు ఉన్నారు.



## అవినీతికి పాల్పడిన వారిని వదలం



ముద్దనూరు, అక్టోబర్ 04, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలోని మరియు గ్రామంలోని జగనన్నా కాలనీలోని నిర్మాణాల్లో గత ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణం జరిగిందని గత కొద్ది రోజులుగా వస్తున్న ఆరోపణలపై హౌసింగ్ జిల్లా అధికారి(పీడీ) రాజా రత్నంను వివరణ కోరగా ఈ సమస్య కడప జిల్లా కలెక్టర్ శివశంకర్ దృష్టికి వెళ్లడం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి అధికారులు అవినీతికి పాల్పడినట్లు రుజువు అయితే తప్పకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంఆమని తెలిపారు. ఇవే కాకుండా పూర్తి మండల స్థాయిలో విచారణ జరిగిపే ఇంకా చాలా అవినీతిబయటపడుతుందని మండలంలో ప్రజలు గృహ నిర్మాణ లబ్దిదారులు అనుకుంటున్నారు.

## పురుగు మందుల దుకాణాలను పరిశీలించిన ఏవో



ముద్దనూరు, అక్టోబర్ 04, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలో ఉన్న ఎరువులు మరియు పురుగుమందులు దుకాణాలను ఎడిఏ వి.వెంకట సుబ్బయ్య మరియు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి.వెంకట కృష్ణారెడ్డి కలిసి శుక్రవారం నాడు ఆకస్మికంగా తనిఖీలు చేసి రికార్డులు, సంబంధించిన పత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే ఫారం ఓలు, పిసిలు మరియు ఇన్వాయిస్ అలాగే స్టాక్ రిజిష్టర్లు, గోడౌన్ నిల్వలు పరిశీలించినట్లు తెలిపారు. అమ్మిన ప్రతి వాటికి నగదు బిల్లులు ఇవ్వాలని సూచించారు. ధరల పట్టిక అప్డేట్ చేసి ఉంచాలని అలాగే స్టాక్ బోర్డు రాసి ఉంచుకోవాలని తెలిపారు. డిబిటి మిషన్ ద్వారా ఎరువులు కొన్న రైతులు వివరాలు నమోదు చేసి ఉంచాలని సూచించారు. అనుమతి లేని ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనామక బయో ఉత్పత్తులు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా డీలర్లు పాల్గొన్నారు.

## చాపాడు తహసీల్దార్‌గా రమా కుమారి

చాపాడు, అక్టోబర్ 04, ప్రభాతవార్త:



చాపాడు నూతన తహసీల్దార్‌గా శుక్రవారం రమా కుమారి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రవీంద్రా రెడ్డి కలసపాడుకు బదిలీపై వెళ్లిపోయారు. ముద్దనూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రమాకుమారి చాపాడు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రైతులకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అదేవిధంగా ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటి తహసీల్దార్ యామిని ఎర్రగుంట్లకు బదిలీ కాగా కృష్ణారెడ్డి డిప్యూటి తహసీల్దార్‌గా చాపాడుకు బదిలీపై వచ్చారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్

యర్రగుంట్ల, అక్టోబర్ 04, ప్రభాతవార్త:



సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ మైసూరా రెడ్డి కుమారుడు జమ్మలమడుగు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి సోదరుడు యర్రగుంట్ల మున్సిపల్ చైర్మెన్ మూలే హర్షవర్ధన్ రెడ్డి శుక్రవారం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి రాజీనామాను తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పంపినట్లు తెలిపారు. గత కొంత కాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న హర్షవర్ధన్ రెడ్డి పార్టీలో సరైన గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎస్సారైటీలో రోబోటిక్స్‌పై వర్క్ షాప్





ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 04, ప్రభాతవార్త:

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం బెంగుళూరుకు చెందిన యుని ఫస్ట్ రోబోటిక్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ సెకండ్ బిటెక్ ఏఐ, ఎంఎల్, థర్డ్ బిటెక్ సీఎస్‌ఈ విద్యార్థులకు రోబోటిక్స్ పైన వర్క్ షాప్ నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ పాండు రంగన్ రవి తెలిపారు. సునీల్ కుమార్ రోబోటిక్స్ పనితీరు వివిధ రోబోట్స్, టూల్ లాంగ్వేజెస్ టె బిల్డ్ ఏ రోబో, వివిధ పరిశ్రమలలో రోబోట్ యొక్క ప్రాముఖ్యత మొదలగు విషయాలను వివరింగా తెలియజేశారు. చైర్మెన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి ఇటువంటి వర్క్‌షాప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌ఈ హెచ్ఓడి డాక్టర్ సుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అమరావతి టిఎన్టియూసి సమావేశంలో పాల్గొన్న కడప జిల్లా టిఎన్టియూసి అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 04, ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో టిఎన్టియూసి రాష్ట్ర సమావేశంలో కడప జిల్లా టిఎన్టియూసి బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియూసీ కడప జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్ కమిటీ సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను, టిఎన్టియూసి రాష్ట్ర అధ్యక్షులు గొంతుముక్కల రఘురామరాజుని మర్యాదపూర్వకంంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాక జిలాలోని మూతపడ్డ పరిశ్రమలు మరియు పలు కార్మిక సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియూసి రాష్ట్ర కార్యదర్శి ఉండేల బాల ముని రెడ్డి, జిల్లా టిఎన్టియూసి అధికార ప్రతినిధి దేశం రెడ్డి, టిడిపి నాయకులు బంగారు మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



